
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 16 నవంబరు 2025

వరకట్న నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి: డీఆర్వో

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరకట్న నివేధ చట్టం 1961, గృహ హింస రక్షణ చట్టం-2025 పక్కాగా అమలు కావాలని డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి ఆదేశించారు. తన చాంబర్‌లో జిల్లా అడ్వయిజరీ బోర్డు కమిటీ మెంబర్లతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. వరకట్నం ఇవ్వడం లేదా తీసుకోవడం నేరమని, వరకట్న నిషేధ చట్టంపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఆర్‌డీవో, ఎంఆర్‌వో కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

ప్రయాణం.. కాకూడదు బతుకు ఛిద్రం

పింఛనుకూ నోచుకోక..



బొబ్బిలిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన మెకానిక్ కాజ వేణు ఏడాదిన్నర క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరం, కుమారుడు ఏడో తరగతిలో చదువుతున్నారు. అనుకోని ఆ ప్రమాదంతో కుటుంబం అనాదిగా మారి నేటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ప్రభుత్వపరంగా ఎలాంటి సాయం అందకపోవడంతో ఆమె కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. వేణు మెకానిక్‌గా పనిచేసిన సమయంలో భార్య, బిడ్డలు ఎంతో ఆనందంతో బతికేవారు. ఆమెకు నేటికీ పింఛను కూడా మంజూరు కాలేదు.

తిన్నావా అని అడిగేవాడు..



బొండపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి పూట ఎలా ఉన్నావు.. తిన్నావా అంటూ ఆలనాపాలన చూసే కుమారుడు సతీష్ (22) అడిగేవాడు. కొడుకు అకాల మృతితో అనాథగా మిగిలానని తల్లి పురం రామయ్యమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఏడాది జూన్ 19న బొండపల్లి నుంచి రాచకిండాం వెళ్లే రోడ్డులో బైకు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో మూడు కుటుంబాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. వారిలో ఒకరు సతీష్. నిరాశ్రయు రాలిగా మిగిలానని, ప్రభుత్వం కూడా ఎటువంటి సహకారం అందించకపోవడంతో జీవనం కష్టంగా మారిందని కన్నీరుమున్నీరైంది.



రోడ్డు ప్రమాదంలో ఒకరిని కోల్పోతే ఓ కుటుంబమే రోడ్డున పడుతుంది. ఒక్కసారిగా నడి సముద్రంలో నెట్టేసినట్లు అనిపిస్తుంది. భవిష్యత్ కనిపించని ఆందోళన చుట్టుముడుతుంది. నలుగురైదుగురు కుటుంబ సభ్యులకు శిక్ష పడిన అనుభవం తోస్తుంది. అందుకే రోడ్డుపై ప్రయాణించేటప్పుడు మన కుటుంబాన్ని గుర్తు పెట్టుకుని ముందుకు వెళ్లాలని, రూల్స్ పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణం సాగించాలని మానసిక వేత్తలు చెబుతుంటారు. స్వీయరక్షణే కీలకమంటారు. ఇటు ప్రభుత్వం కూడా ప్రమాదకర స్థలాల వద్ద జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. ఈ ప్రక్రియ సరిగా జరగక అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం పురస్కరించుకుని కథనం..

- మానవ తప్పిదంతో నేటికీ ఎన్నో ప్రమాదాలు
- అగమ్యగోచరంగా ఆయా కుటుంబాలు
- ఇంటి పెద్ద మరణిస్తే.. వీధిన పడాల్సిందే
- అందివచ్చిన కొడుకు లేకపోతే తల్లిదండ్రులకు వ్యథే
- హెల్మెట్ ధారణ, స్వీయరక్షణతోనే ప్రమాదాలకు దూరం
- నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

విజయనగరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి)

ప్రమాదం చెప్పి రాదు.. కానీ నిర్లక్ష్యం చేస్తే అందుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఇటీవల ఏదోచోట ప్రమాదం జరుగుతూ ఉంది. హెల్మెట్ ధరించకపోవడం, పరిమితికి మించి ప్రయాణాలు చేయడం, అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి కారణాలతో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే మానవ తప్పిదంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట పడడం లేదు. 2022లో జరిగిన ప్రమాదాల్లో 244 మంది మృతిచెందారు. 925 మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 213 మంది చనిపోతే 826 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 230 మంది మృతి చెందితే 815 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది ఈ 10 నెలల కాలంలో దాదాపు 166 మంది వరకూ మృత్యువాత పడగా 650 మంది క్షతగాత్రులయ్యారని పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ద్విచక్ర వాహన ప్రమాదాలకు సంబంధించి ఎక్కువగా హెల్మెట్ ధరించకపోవడం వల్లే జరుగుతున్నాయని తెలుస్తుండడం ఆందోళనకరం. చాలామంది తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టిసారించడం లేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా.. ప్రమాదాలు జరిగి మూల్యం చెల్లించుకున్న తరువాత అయ్యో అని బాధపడుతున్నారు.



వారి బాధలు చెప్పలేనివి..

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలు, బాధిత (మిగతా 8వ పేజీలో..)

రోడ్డు ప్రమాదంలో వెయిట్‌లిఫ్టర్ దుర్మరణం

- పోటీలకు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఘటన
- 25 రోజుల క్రితం తండ్రి మృతి
- విషాదంలో సత్యజ్యోతి కుటుంబం, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు



సత్యజ్యోతి(ఫైల్)

విజయనగరం క్రైం/నెల్లిమర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కొండవెలగాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు శనివారం రాత్రి విజయనగరం నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రీడాకారిణి సత్యజ్యోతి(26) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. విజయనగరం దాటాక ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. 25 రోజుల క్రితం తండ్రి మృతి చెందాడు. ఆ బాధ నుంచి తేరుకోకముందే ఈమె మృతితో కుటుంబ సభ్యులు తీవ్రంగా విలపిస్తున్నారు.

విజయనగరంలోని బాబామెట్ట ఏడు కోవెళ్ల సమీపంలో ఉంటున్న తాడితూరి భాస్కరరావు, యశోద దంపతుల కుమార్తె తాడితూరి సత్యజ్యోతి (26) వాల్తేరు డివిజన్‌లోని ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో జూనియర్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి భాస్కరరావు కలెక్టరేట్ ప్లానింగ్ సెక్షన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 25 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి యశోద రెండేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సత్యజ్యోతి నాలుగో సంతానం. పెద్దకుమార్తె సంధ్యాదేవి వీఆర్వోగా పనిచేస్తోంది. రెండో కుమార్తె సరోజగాయత్రి ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తోంది. సోదరుడు సతీష్‌బాబు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా ఉన్నాడు. సత్యజ్యోతి శనివారం కొండవెలగాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా పోటీలను తిలకించేందుకు అక్క సరోజగాయత్రితో విజయనగరం నుంచి టూవీలర్‌పై బయలుదేరింది. విజయనగరం దాటాక (మిగతా 8వ పేజీలో..)



వైస్ ప్రిన్సిపాల్ వింగ్ కమాండర్ కిరణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పూర్వ విద్యార్థి రామారావు



సైనిక స్కూల్ ఆవరణలో కలియతిరుగుతూ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న పూర్వ విద్యార్థులు

ఆ గురుతులు అపూర్వం

- స్కూల్ అంతా కలియతిరిగి.. తరగతి గదిలో కూర్చుని
- ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపిన కోరుకొండ సైనిక స్కూల్ పూర్వ విద్యార్థులు
- నాటి ఉపాధ్యాయులకు సన్మానం

విజయనగరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

కోరుకొండ సైనిక స్కూల్‌లో యాభై ఏళ్ల కిందట చదువుకున్న వారిలో దాదాపు 50మంది (1968 నుంచి 1975బ్యాచ్) పూర్వ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. ఉదయం 11 గంటలకు స్కూల్‌లోని పీవీజీ రాజు సమావేశ భవనంలో సమావేశమయ్యారు. ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి కెప్టెన్ సీఎం రెడ్డి అధ్యక్షత (మిగతా 8వ పేజీలో..)

చదువు పూర్తయ్యాక ఉన్నత ఉద్యోగాలు చేసి.. కీలక బాధ్యతలు చూసి.. రిటైర్డ్ అయిన వారంతా ఒక్కసారి చిన్నపిల్లలైపోయారు. చదువుకున్న నాటి సంగతులను నెమరు వేసుకుంటూ స్కూల్ పరిసరాల చుట్టూ కలియతిరిగారు. తాము కూర్చుని మాట్లాడుకున్న స్థలాలను, చెట్టు కింద ఆడిన ఆటలను గుర్తుతెచ్చుకుని పులకించిపోయారు. స్నేహితులకు పెట్టిన నిక్‌నేమ్‌లను గుర్తు చేసుకుని ఉబ్బితబ్బిబ్బయ్యారు. తరగతి గదిలో కాసేపు గడిపి బాల స్నేహితులుగా మారారు. ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. యాభై ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరంతా కోరుకొండ సైనిక స్కూల్ పూర్వ విద్యార్థులు. స్కూల్‌కు శనివారం హాజరై అ'పూర్వ' గురుతులను జ్ఞాపకం చేసుకుంటూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

7లో

నిధులు మంజూరు చేయండి

- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశను కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- విశాఖ సీఐఐ సదస్సుకు హాజరు

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు

సీనియర్ సిటిజన్లకు న్యాయ సేవలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్య

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త సూర్యారావు

వైభవంగా లక్ష దీపారాధన

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బంగారం కోసమే హత్య?

- ఉలిక్కిపడ్డ వియ్యంపేట గ్రామస్థులు

8లో

కెల్లలో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్

- 1085 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం
- రూ.8570 కోట్లతో ఏర్పాటు చేయనున్న సూపర్ స్మెల్టర్స్
- గుర్ల ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశం

గుర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం కెల్ల గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంటు ఏర్పాటు కానుంది. ముందుకొచ్చిన సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్‌కు ప్రభుత్వం 1,085 ఎకరాలు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ రూ.8,570.50 కోట్లతో ఏడాదికి 2 మిలియన్ టన్నుల స్టీల్‌ను (మిగతా 8వ పేజీలో..)



కెల్ల రెవెన్యూ పరిధిలో స్టీల్ ప్లాంట్ ప్రతిపాదిత స్థలం

ఆ భారమూ.. మహిళలపైనే..



- కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు పురుషులు దూరం
- నేడు ప్రపంచ వాసెక్టమీ దినం

- 2023-2024లో వాసెక్టమీ చేయించుకున్న పురుషులు 43 మంది. ట్యూబెక్టమీ చేయించుకున్న మహిళలు 4,194 మంది.
- 2024-2025లో వాసెక్టమీ చేయించుకున్న పురుషులు 31 మంది, ట్యూబెక్టమీ చేయించుకున్న మహిళలు 3,965 మంది.
- 2025 అక్టోబరు వరకు వాసెక్టమీ చేయించుకున్న పురుషుల సంఖ్య 5, ట్యూబెక్టమీ చేయించుకున్న మహిళలు 2,232 మంది.

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం గత మూడేళ్లలో 10,391 మంది మహిళలు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు (ట్యూబెక్టమీ) చేసుకున్నారు. పురుషులు మాత్రం కేవలం 79 మంది మాత్రమే కు.ని.శస్త్ర చికిత్సలు (వాసెక్టమీ) చేయించుకున్నారు. దీన్ని బట్టి పురుషులు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్టు అర్థమవుతోంది. పురుషులకు చేసే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సను వాసెక్టమీగా... స్త్రీలకు చేసే కు.ని.శస్త్ర చికిత్సను ట్యూబెక్టమీగా పిలుస్తారు. కు.ని.శస్త్ర చికిత్సను భార్యాభర్తల్లో ఒకరు చేయించుకుంటే సరిపోతుంది. వైద్యశాఖ గణాంకాలను బట్టి చూస్తే ఈ శస్త్ర చికిత్సలను మహిళలు మాత్రమే చేసుకోవాలన్న విధంగా పురుషుల తీరు ఉంటోంది. ప్రస్తుతం అత్యధిక శాతం మహిళలకు శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలు చేయిస్తున్నారు. ఇది దీర్ఘకాలంలో వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు. దీనికి తోడు కు.ని.శస్త్ర చికిత్సలనూ మహిళలే చేయించుకోవాల్సి వస్తోంది.

చిన్న శస్త్ర చికిత్స వాసెక్టమీ..

సంతానోత్పత్తిని నివారించడానికి పురుషులకు చేసే గర్భ నిరోధక శస్త్ర చికిత్స వాసెక్టమీ. ఇది చిన్న శస్త్ర చికిత్స. పురుషులు మేల్కొని ఉన్నపుడే ఈ ప్రక్రియ జరుగుతుంది. కేవలం శస్త్ర చికిత్స చేసే ప్రాంతంలో మాత్రమే మత్తు ఇస్తారు. పావు గంట వ్యవధిలో వైద్యులు దీన్ని పూర్తి చేసేస్తారు. పిల్లలు కావాలనుకునేవారు దీన్ని మరలా తెరవవచ్చు. కొన్నిసార్లు సాధ్యం కాకపోవచ్చు. అందుకే పిల్లలు వద్దనుకున్నప్పుడే దీన్ని పాటిస్తే మంచిది. చాలా సులువుగా చేసే ఈ చిన్నపాటి శస్త్ర చికిత్సను వద్దనుకునే పురుషులే ఎక్కువ. వివిధ రకాల అనుమానాలు, అపోహలు, భయాలే ఈ శస్త్ర చికిత్సలకు పురుషులు దూరంగా ఉండడానికి కారణం. వైద్యులు ఎంతగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నా... పురుషుల్లో అనుమానాలు తొలగిపోవడం లేదు. వాసెక్టమీ చేసుకున్న పురుషులు ఒక రోజులో కోలుకుంటారు. వెంటనే పనులకు వెళ్లవచ్చు. అదే ట్యూబెక్టమీ అయితే మహిళల పొట్ట కోసి...శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. దీని వల్ల వారు కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని రోజుల వరకు పనులు చేసేందుకు అవకాశం ఉండదు. వాసెక్టమీకి ఇతర ఇబ్బందులు ఉండవు. కానీ ఈ శస్త్ర చికిత్స చేసుకున్న వారి శరీరంలో శక్తి ఉండదని... బరువు పనులు చేయలేరని... లైంగిక సామర్థ్యం తగ్గుతుందనే అపోహలు ఉన్నాయి. అత్యధిక కుటుంబాలు పురుషుల సంపాదనపై ఆధారపడినవే. ఇది కూడా వాసెక్టమీల సంఖ్య తగ్గడానికి ఓ కారణంగా చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



పురుషులు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది వాసెక్టమీపై ప్రచారం చేస్తున్నారు. అయినా పురుషులు ముందుకు రాకపోవడంతో మహిళలకు ఈ శస్త్ర చికిత్స చేయాల్సి వస్తోంది. జనాభా నియంత్రణకు కుటుంబంలో ఎవరో ఒకరికి చేయకతప్పదు.

-డాక్టర్ జీవనరాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, విజయనగరం

పురుషులు అపోహలు వీడాలి..



పురుషులు కుటుంబ నియంత్రణ చికిత్సలపై అపోహలు వీడాలి. అప్పుడే వాసెక్టమీకి ముందుకు వస్తారు. బరువు పనులు చేయలేమని, లైంగిక సామర్థ్యం తగ్గుతుందన్న వార్తలు వదంతులే. మహిళలు చేసుకునే ట్యూబెక్టమీ కంటే పురుషులకు చేసే వాసెక్టమీ శస్త్ర చికిత్స చాలా సులభమైనది. ఎటువంటి కుట్లు, కోత ఉండదు.

-డాక్టర్ ఎస్.వి. సత్యశేఖర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గజపతినగరం,నవంబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ నున్నట్లు సీఈవో నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రామసుందర్‌రెడ్డితోపాటుజిల్లా అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

గంట్యాడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుపై టీఏ, డీఏ, మిల్లర్లకు అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఈ శిక్షణ జరిగింది. మండలంలో 20రైతు సేవా కేంద్రాల్లో 16 క్లస్టర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ నారాయణమూర్తి, వ్యవసాయ అధికారి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న రెడ్‌క్రాస్ సమావేశం

చీపురుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో రెడ్‌క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేందుకు ఈ నెల 25న సమావేశం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డి. ధర్మరాజు, మేనేజింగ్ కమిటీ మెంబరు బీవీ గోవిందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు చీపురుపల్లి తహసీల్దారు కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పేట్రన్స్, వైస్ పేట్రన్స్ హాజరు కావాలని వారు కోరారు.

అక్షరాస్యతపై అవగాహన

విజయనగరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతపై అవగాహన పెంపొందించాలని ఎంపీడీవో గంటా వెంకటరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో అక్షరాస్యత, నిరక్షరాస్యత కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, వయోజన విద్య మండల అధికారులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో బహుళ ప్రయోజనాలు

రేగిడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేతో బహుళ ప్రయోజనాలు కలగనున్నాయని ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. గుళ్లపాడు పంచాయితీ కేఎం వలసలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ కంఠ స్థలాలపై యజమానులకు పూర్తి హక్కులు కల్పిస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు సకాలంలో తెప్పించి రైతులను ఆదుకోవాలని పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం నాయకులు ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ గొర్రిపాటి సింహాచలం నాయుడును కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొల్లి కోటేశ్వరరావు, మెరుపుల నారాయణ మూర్తి, అప్పారావు, చప్ప శ్రీనివాసరావు, రాయవరపు శ్రీనివాసరావు, చోడవరపు వెంకటరావు, కోటరావు తదితరులు వున్నారు.

బిందు, తుంపర సేద్యానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రేగిడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్యం చేస్తున్న రైతులు ఆర్‌ఎస్‌కేల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న ఎస్సీ రైతులకు వంద శాతం రాయితీపై, ఇతర రైతులకు 90శాతం రాయితీ, పది ఎకరాలు దాటిన రైతులకు 70శాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయండి

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి పేర్కొన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. మహిళలంతా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రతి మహిళ ఎంటర్ ప్రెన్యూర్‌గా మారాలన్నారు. స్త్రీనిధి ఉన్నతి సీఐఎఫ్ రికవరీ శతశాతం చేయాలన్నారు. డిజిటల్ ఎంసీపీ ద్వారా బ్యాంకు లోన్లు అవసరమైనవారికి ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అరుణ, సీసీలు యు.కోటరావు, మంగమ్మ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబు సేవలు అభినందనీయం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు దళిత, బహుజన, శ్రామిక యూనియన్ ప్రతినిధి పి.చిట్టిబాబు చేస్తున్న సేవలు అభినందనీయమని ఏటీకే వెలుగు వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు, ఖాదర్‌బాబా దర్గా ధర్మకర్త ఖలీలుబాబు అన్నారు. ఖతర్ రాజధాని దోహాలో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సులో పాల్గొని పేదరికం, వివక్షత, ఆకలి చావులు అనే అంశంపై మాట్లాడిన చిట్టిబాబు, దంపతులను దర్గా వ్యవస్థాపకులు ఖలీలుబాబు శనివారం సత్కరించారు. కార్యక్రమంలో ఎలిశెట్టి సురేష్, సీఐలు నర్సింహమూర్తి, వెంకట రమణ, ఎస్ఐ సత్యనారాయణ, అహ్మద్‌బాబు, రాము, జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- విశాఖ సీఐఐ సదస్సుకు హాజరు



సీఎం చంద్రబాబుతో జనసేన ప్రచారకమిటీ రాష్ట్ర కార్యదర్శి పాగిరి సురేష్‌బాబు

విజయనగరంరూరల్/రాజాం/రూరల్/పాలకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో శనివారం జరిగిన సీఐఐ సదస్సులో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు, ఐటీ శాఖామంత్రి లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియోజక వర్గాల్లోని పలు సమస్యలపై చర్చించారు. సాగునీరు, గ్రామీణ రహ దారుల పనులు చేట్టడా నికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. వీరితో పాటు జనసేన ప్రచారకమిటీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు పొగిరి సురేష్‌బాబు కూడా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, నారాయణను కలిసి సమస్యలపై వారికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి



హాజరైన ఎమ్మెల్యే జయకృష్ణ





ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు, మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

పోరాటాలే శరణ్యం

రాజాం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు అన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన యూనియన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మునిసిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత సమ్మెకాలంలో అంగీకరించిన ఒప్పందాలు నేటికీ అమలు చేయలేదని గుర్తుచేశారు. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోతే దశలవారీ పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కాశీవిశ్వేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వైభవంగా లక్ష దీపారాధన

సంతకవిటి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రెండో ఏకాదశి సందర్భంగా మోదుగులపేటలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో శనివారం లక్ష దీపారాధన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శివనామస్మరణ మార్మోగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

సీనియర్ సిటిజన్లకు న్యాయ సేవలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

విజయనగరం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో సీనియర్ సిటిజన్లకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయ సేవలు అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత అన్నారు. శనివారం ఫూల్‌బాగ్‌లోని ప్రేమ సమాజాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. వయోవృద్ధుల పోషణ, నిర్వహణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను పిల్లలు సరిగ్గా చూడకపోతే, వారిపై కేసు వేసే వెసులుబాటు చట్టంలో ఉందన్నారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే న్యాయ సేవాధికార సంస్థని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, పీపీ గేదెల సత్యం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కొండపల్లి సూర్యప్రకాష్, ప్రేమసమాజం కార్యదర్శి ఆదినారాయణ, బసవ మూర్తి, రఘు రామారావు, తాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

- సీనియర్ న్యాయాధికారి శారదాంబ



అధికారులకు సూచనలిస్తున్న సీనియర్ న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల న్యాయసేవాసంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపునిచ్చారు. కోర్టుప్రాంగణంలో న్యాయవాదులు, పోలీసు, రెవెన్యూ, బ్యాంకర్లు, చిట్‌ఫండ్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్స్ మున్సిపాలిటీ, ఎక్సైజ్ అధికారులు, జూనియర్ న్యాయాధికారి కె.నైమిషతో కలిసి శనివారం సమావేశమయ్యారు. అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసుల్ని పరిష్కరించుకోవచ్చని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదాలత్ విజయవంతానికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని కోరారు. అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమతీర్పుగా న్యాయాధికారి స్పష్టం చేశారు. సివిల్ కేసులు అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే కోర్టుఫీజు కూడా వాపస్ ఇస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో రాజాం తహసీల్దార్ రాజశేఖర్, రాజాం, సంతకవిటి ఎస్‌ఐలు రవికిరణ్, గోపాలరావు, ఎక్సైజ్ ఎస్‌ఐలు మాన్యాలు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన చేపట్టాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీ జనాభా థామాషా ప్రకారం చట్టబద్ధ రిజర్వేషన్ అమలయ్యేలా డెడికేటెడ్ సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం మూడులాంతర్ల సమీపంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర కులగణన జరిపించాలని తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసినట్లు చెప్పారు. దీంతో హైకోర్టు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి పంచాయతీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులకు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు నోటీసులు జారీ చేసిందన్నారు. ఎన్నికల సమయం వచ్చే వరకూ బీసీ కులగణన చేయకపోవడంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు గొర్లె సూరిబాబు, హరిబాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అదే నిజమైతే జిందాల్‌పై కేసు వెనక్కి తీసుకుంటాం

- ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ఎస్.కోట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'అధికారులు ప్రజల కోసం కాకుండా పరిశ్రమల పెద్దల కోసం పనిచేయడం బాధగా ఉంది. జిందాల్ భూములపై వారు వ్యవహరిస్తున్న తీరు సరిగాలేదు' అని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం బొడ్డవర గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిందాల్ కోసం కేటాయించిన భూములు గత 18ఏళ్లుగా ఆ పరిశ్రమ అధీనంలో ఉన్నాయని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని, ఈ విషయంపై బహిరంగ విచారణ చేపట్టాలని అన్నారు. అదే నిజం అయితే తాము జిందాల్ పరిశ్రమ మీద వేసిన కేసులను వెనక్కి తీసుకుంటామని అన్నారు. ఈ భూములు గత జూన్ వరకూ రైతుల వద్దే ఉన్నాయన్న విషయం ఈ ప్రాంత వాసులకు తెలుసన్నారు. నిర్వాసితులు 154రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులకు పట్టకపోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు కూడా రైతుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

నిజాలు బయటకు వస్తున్నాయి



నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోటరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ భూముల్లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సర్వేతో నిజాలు బయటకు వస్తున్నాయని నిర్వాసితులు అన్నారు. 154వ రోజు శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నిర్వహించిన గ్రామసభలో 199 మంది రైతులు జిందాల్‌పై ఫిర్యాదులు చేశారన్నారు. దీనిపై విచారణ చేస్తున్నారని, ఈ తరుణంలో తమ భూములు తమ సాగులోనే ఉన్నాయన్న నిజం వెలుగులోకి రావడం సంతోషం కల్గిస్తుందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి తమ భూములు వెనక్కి ఇవ్వాలని కోరారు.

మహనీయుడు బిర్సా ముండా



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బిర్సా ముండా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ అన్నారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. గిరిజనుల భూమి, జీవన అధికారాలను రక్షించడానికి చేసిన పోరాటంతో బిర్సా ముండా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పతివాడ రాజేష్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్య



మాట్లాడుతున్న సూర్యారావు

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన అందించనున్నట్లు జిల్లా సహిత విద్యసమన్వయ కర్త ఎస్.సూర్యారావు తెలిపారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉచిత ఉపకరణాల ఎంపిక నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే భవిత కేంద్రాల్లో ట్యాబ్‌ల ద్వారా బోధన జరుగుతుందన్నారు. గత ఏడాది కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా దివ్యాంగ విద్యార్థులు కంప్యూటర్ సహాయంతో పరీక్షలు రాసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో డిజిటల్ బోధనకు సమగ్రశిక్ష అభియాన్ ప్రణాళికలు తయారు చేస్తుందన్నారు. ఈ విద్యాసంవత్సరానికి పలు రకాల ఉపకార వేతనాలు తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, ఎస్.కోట, జామి మండలాల నుంచి 152 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకార పరికరాల ఎంపికకు హాజరయ్యారు. వీరిలో 131మందిని అర్హులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింగరావు, ఉపాధ్యాయులు ఎస్.భానుమతి తదితరులు ఉన్నారు.

మేలు చేసే పనులపై శ్రద్ధవహించాలి

- డీఎల్‌డీవో హేమసుందర్



చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీవో

చీపురుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అప్పగించిన కార్యక్రమాలను మొక్కుబడిగా నిర్వహించవద్దని, వ్యక్తులు, సమాజానికి మేలు చేసే పనులపై అధికారులు శ్రద్ధ వహించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి హేమసుందర్ అన్నారు. శనివారం ఆయన మెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చేతులు శుభ్రం చేసే విధానంపై వారికి అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. వీధుల్లో చెత్త వేయవద్దని, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో అప్పలనాయుడు, సిబ్బంది ఉన్నారు. రామలింగపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం గొర్లె పద్మావతి, బీజేపీ అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు వచ్చి పశ్చిమ బెంగాల్‌వాసి మృతి

పాచిపెంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం కూలీగా వచ్చిన పశ్చిమబెంగాల్ కు చెందిన రంజిత్‌రావు (50) ఈనెల 14న మృతిచెందాడు. తీవ్ర చలితో మృతిచెంది ఉంటాడని పోలీసులు నిర్ధారించారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం నిమిత్తం వారం రోజుల కిందట కాంట్రాక్టర్ వద్దకు వచ్చాడని, అప్పటి నుంచి పని సరిగా చేయకుండా మతిస్థిమితం లేకుండా తిరిగేవాడని పోలీసులు తెలిపారు. సరిగ్గా ఆహారం తీసుకోకపోవడం, ఆపై చలి తీవ్రత వల్ల మోదుగ పంచాయతీ కొత్రగుడ్డి సమీపంలో మృతిచెంది ఉండడంతో సంబంధిత వీఆర్వో పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.వెంకటసురేష్ శనివారం కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

1400 లీటర్ల సారా ధ్వంసం

వీరఘట్టం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగోర సమీపంలో శనివారం తనిఖీలు చేసి 1400 లీటర్ల సారా గుర్తించి ధ్వంసం చేశామని ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. సారా ఎవరైనా తయారు చేసినా అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ గ్లాసులు

విజయనగరం టౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నవీధి, గణేష్ ఆలయం వద్ద ప్లాస్టిక్ విక్రయాలు చేపడుతున్న షాపులపై శనివారం ప్రజారోగ్యశాఖ అధికారి కొండపల్లి సాంబమూర్తి దాడులు చేశారు. 413 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని ఎనర్జీప్లాంట్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. నగరంలో ప్లాస్టిక్ అమ్మకాలు చేపట్టినా.. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించినా చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మెరకముడిదాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు డీఆర్‌డీఏ అదనపు సంచాలకులు రత్నాకర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి అన్నారు. మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో శనివారం 44 గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు అవసరం అయినప్పుడు మాత్రమే రుణాలు అందజేస్తామన్నారు. రుణాలను జీవనోపాధి కార్యక్రమాలకు ఉపయోగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మండలంలో 1,553 సంఘాల్లో ఉన్న సభ్యులందరికీ మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు తాడెల స్వాతి, ఏపీఎం రాజశేఖర్, సీసీలు కోటేశ్వరరావు, శాంతారావు, సూర్యారావు, సత్యనా రాయణ, వెంకటరమణ, వీవోఏలు పాల్గొన్నారు.

ఈ-పంట సోషల్ ఆడిట్

గరివిడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోడూరు గ్రామంలో శనివారం మండల వ్యవసాయాధికారి పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ-పంట సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ-పంట అర్హుల జాబితాను ప్రదర్శించారు. జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు హాజరై మాట్లాడారు. జాబితాలో రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, పంటల సాగు విస్తీర్ణంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఈ-పంట నమోదుతో ధాన్యం కొనుగోలు, విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, పంట నష్టపరిహారం, వివిధ వ్యవసాయ సబ్సిడీ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్.కోటేశ్వరరావు, ఏఏ పర్వేజ్, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

గంట్యాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ముందుగా వ్యవసాయ అధికారి శ్యామ్ కుమార్ తమ శాఖ ప్రగతిని చదివి వినిపించారు. అనంతరం గంట్యాడ ప్రాథమిక వైద్యాధికారి హేమలత మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, ప్రస్తుతం వాతావరణ పరిస్థితిని వివరించారు. విద్యుత్ శాఖ జేఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలలో మొంథా తుఫాన్ కారణంగా విద్యుత్ స్తంభాలు నేల కూలిపోయాయని, అందరి సహకారంతో స్తంభాల పునరుద్ధరణ చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతుందని, దీనిని రైతులు అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో 2025-2026 సవరణ బడ్జెట్, 2026-2027 అంచనా బడ్జెట్‌ను ఎంపీవో రమణమూర్తి చదివి వినిపించడంతో సభ్యులు ఆమోదించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

సంతకవిటి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీడీవో సురేష్‌కుమార్, తహసీల్దార్ సుదర్శనరావు అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు, డాక్టర్ నాగేంద్రప్రసాద్, ఆరోగ్య సిబ్బందితో కలసి కుష్ఠు వ్యాధి నిర్మూలనపై పోస్టర్లు చూపిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు

గుర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గూడెం, పాలవలస గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారిణి వై.మణి ఆధ్వర్యంలో విజయనగరం అర్బన్, రూరల్ ఫైలేరియా యూనిట్ సిబ్బంది రక్తపూతలు సేకరించారు. ఈ రెండు గ్రామాల్లోనూ గతంలో ఫైలేరియా కేసులు రావడం, గత కొన్నేళ్లుగా డీఈసీ సామూహిక మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో వ్యాధి తీవ్రతను అంచనా వేసేందుకు మరోసారి ప్రత్యేకంగా ఈ పరీక్షలు నిర్వహి స్తున్నట్టు డీఎంవో మణి తెలిపారు. రెండు గ్రామాల్లో 20 సంవత్సరాల వయసు దాటిన 600 మందికి ఈ పరీక్షలు నిర్వహించినటు చెప్పారు. గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులను ఆదుకుంటాం

గుర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ఆదుకోవడంలో విశాఖ డెయిరీ ముందుంటుందని పాలవలస విశాఖ డెయిరీ అధ్యక్షుడు పెనుమజ్జి అప్పలనాయుడు అన్నారు. శనివారం పాలవలస గ్రామంలో పాడి రైతులకు పాల క్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో గుర్ల ఏరియా సూపర్‌వైజర్ ఎం.పాపినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణం.. కాకూడదు బతుకు ఛిద్రం

(ఐదో పేజీ తరువాయి)

కుటుంబాలు పడుతున్న వ్యథ అంతా ఇంతా కాదు. ప్రమాదం జరిగినప్పుడు కనికరం చూపే వారు తరువాత పట్టించుకోరు. సొంత వారు సైతం అయ్యోపాపం అనడమే తప్ప ఆదుకోవడం అరుదు. ప్రధానం గా ఇంట్లో పిల్లలు ప్రాథమిక విద్య చదువుతున్నప్పుడు ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబ వ్యథ అంతా ఇంతా కాదు. చేతికి అందివచ్చే కుమారుడు లేకపోతే తల్లిదండ్రుల బాధ చెప్పలేనిది. అందుకే రోడ్డు ప్రమాదం అంటే ఒకరి సమస్య కాదు.ఎన్నో కుటుంబాలతో ముడిపడే అం శం అన్న విషయాన్ని గ్రహించాలి. అందుకే ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు తమ ప్రయాణాల సమయంలో కుటుంబాన్ని గుర్తు పెట్టుకోవాలి.

వెనుక పరమార్థం అదే..

సాధారణంగా పోలీసుల తనిఖీని తప్పుగా అర్థం చేసుకుంటాం. వారు జరిమానాలు విధించినా.. కేసులు నమోదుచేసినా.. దాని వెనుక ఉండే లక్ష్యం రోడ్డు ప్రమాదాల నియంత్రణే అన్న విషయం గ్రహించాం. అటు హెల్మెట్ ధరించాలని చెబుతున్నా పెడచెవిన పెడుతుంటాం. ఈ ఏడాది మార్చి 1 నుంచి హెల్మెట్ ధారణకు సంబంధించి కీలక ఆదేశాలు వచ్చాయి. కోర్టు తీర్పు నేపథ్యంలో కఠిన నిబంధనలు, జరిమానాలు అమల్లోకి వచ్చాయి. అయినా సరే వాహనదారుల్లో మార్పురాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మార్చి1 కంటే ముందు హెల్మెట్ లేకుండా ప్రయాణానికి సంబంధించి రూ.135 జరిమానా వేసేవారు. మారిన నిబంధనలతో రూ.1000 కట్టాల్సిందే. లైసెన్స్ లేకుండా బండి నడిపితే రూ.10 వేలు వసూలు చేస్తారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగితే కేసులు నమోదుచేస్తారు. 90 రోజుల్లో జరిమానా కట్టకపోతే బండి సీజ్ చేస్తారు. గత నాలుగు నెలల్లో హెల్మెట్ ధరించని వారిపై నమోదైన కేసులు 1329, లైసెన్స్ లేనివారు 1437 మందిపై కేసు నమోదుచేసినట్లు పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

కుటుంబాన్ని గుర్తు పెట్టుకోవాలి..

నవ్వుతూ ఇంటినుంచి బయటకు వెళ్లిన భర్త లేదా కుటుంబాన్ని పెంచి పోషిస్తున్న కొడుకు రోడ్డుప్రమాదంలో మృతి చెందితే ఆ బాధ వర్ణనాతీతం. ఆదుకుంటున్నవారు, కూడు పెట్టిన వారు కరువైతే వారి పరిస్థితి అగమ్యగోచరం. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తు పెట్టుకోవాలి. ప్రయాణంలో ఉన్నా కూడా కుటుంబం గురించి ఆలోచించాలి. నిదానమే ప్రధానం. వేగమంతమైన ప్రయాణం మంచిది కాదు. భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రయాణం సాగిస్తే ఎలాంటి అపాయం కలగదు. ఇదే లక్ష్యంతో పోలీసులు నిరంతరం తనిఖీలు చేస్తుంటారు.

-ఏఆర్ దామోదర్, ఎస్పీ

వెయిట్‌లిఫ్టర్ దుర్మరణం

(ఐదో పేజీ తరువాయి)

ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. సత్యజ్యోతి లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఎన్నో పతకాలు సాధించి మేటి క్రీడాకారిణిగా ప్రశంసలు అందుకున్న సత్యజ్యోతి అకాల మరణాన్ని క్రీడాకారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె మరణవార్త జిల్లా క్రీడాకారుల్లో పెను విషాదం నింపింది. సత్యజ్యోతి ఆదివారం ఉదయం జరుగనున్న పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. ఆమె మృతితో పోటీలు జరుగుతున్న ప్రాంతంలో విషాదం అలముకుంది. వెయిట్ లిఫ్టింగ్ క్రీడా ప్రతిభతోనే రైల్వేలో సత్యజ్యోతి ఉద్యోగం సాధించింది.

కెల్లలో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్

(ఐదో పేజీ తరువాయి)

ఉత్పత్తి చేయనుంది. తద్వారా 750 మందికి ఉపాధి కలగనుంది. టౌన్ షిప్ ఏర్పాటుకు మరో 97.04 ఎకరాలు, రైల్వే సైడింగుకు 53.35 ఎకరాలు కూడా కేటాయించనున్నారు. రెండు దశల్లో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో పెద్ద మండలంగా ఉన్న గుర్లలో ఉపాధి అవకాశాలు లేక వెనుకబడి ఉంది. 47 పంచాయతీలు, 52 గ్రామాలు ఉన్నప్పటికీ సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులు వలసబాట పడుతున్నారు. ఇంకోవైపు నీటి వనరులు ఉన్నప్పటికీ వాటినీ పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గడిగడ్డ రిజర్వాయర్ అభివృద్ధికి నోచుకోలేదు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసినప్పటికీ ఇంతవరకు అతిగతీలేదు. మెరకముడిదాం మండలం సరిహద్దుల్లో ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు ఉన్నప్పటికీ సరిగా పనిచేయడం లేదు. ఈ ప్రాంతవాసులు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. చాలా వరకు విజయనగరం, విశాఖపట్టణా లకు వలస వెళ్లి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు అవకాశాలు కల్పించేందుకు అడుగు పడడాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. కాగా ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ కోసం ఎస్ఎస్ఆర్.పేట, సోలిపి, సోమరాజుపేట, మన్యపురిపేట, బెల్లానపేట, దమరసింగి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ గ్రామాల్లో మాత్రమే భూములను ప్రభుత్వం సేకరించింది.

తహసీల్దార్ ఏమన్నారంటే...

తహసీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్.పేట నుంచి కొండప్రాంతాల్లో భూమిని సర్వే చేశామని, కెల్ల రెవెన్యూకు సంబంధించిన విస్తీర్ణం ఎక్కువగా ఉందన్నారు. 1080 ఎకరాలు ఉన్నట్లు ప్రభుత్వం తెలిపిందని, ల్యాండ్ సర్వే చేసి రిపోర్టు అందించాలని అధికారులు చెప్పడంతో తాము సర్వేచేసి అప్పగించినట్లు తెలిపారు. మిగతా విషయాలు తమకు తెలిదన్నారు.

బంగారం కోసమే హత్య?

● ఉలిక్కిపడ్డ వియ్యంపేట గ్రామస్థులు



దూదిరాము (ఫైల్)

కొత్తవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వియ్యపేటలో ఓ మహిళ శుక్రవారం రాత్రి హత్యకు గురైంది. ఈ విషయం శనివారం ఉదయం తెలిసి గ్రామమంతా ఉలిక్కి పడింది. పుస్తెల తాడు, వెండిపట్టీలు, చెవులకు ఉన్న బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో బంగారం కోసమే గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వియ్యంపేటకు చెందిన దూది రాము(59) భర్త ఇప్పటికే చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈమెకు కుమారుడు గౌరీ శంకర్, కుమార్తెలు సత్యవతి, దేవి ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. కుమారుడు శృంగవరపుకోట మండలం ముషిడిపల్లి గ్రామం వద్దనున్న లే అవుట్‌లో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తల్లి రాము కుమారుడుకు ఫోన్ చేసి ఇంట్లో బియ్యం అయిపోయాయి తీసుకు రావాలని చెప్పింది. శనివారం బియ్యం పట్టుకువస్తానని చెప్పాడు. కాగా ప్రతిరోజు కార్తీక స్నానాల కోసం ఆమె ఉదయం లేచి అందరినీ పిలిచేది. శనివారం ఉదయం ఎంతకూ లేవకపోవడంతో చుట్టుపక్కలనున్న మహిళలు ఇంటికి వెళ్లి చూడగా ఆమె అచేతన స్థితిలో కంటపడింది. వెంటనే కుమారుడు గౌరీశంకర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన వచ్చి చూశాడు. తల్లి మెడలో ఉన్న సుమారు మూడున్నర తులాల పుస్తెల తాడు, వెండిపట్టీలు, చెవులకు ఉన్న బంగారు ఆభరణాలు కనిపించడకపోవడంతో బంగారం కోసమే తన తల్లిని ఎవరో హత్య చేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిద్రిస్తున్న రాము ముఖంపై తల గడ పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపి ఉంటారని తల వెనుక గాయాలను బట్టి పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద కేక వినిపించినట్టు చుట్టు పక్కల వారు చెబుతున్నారు. ఇంట్లో ఏమైనా గొడవ పడుతున్నారేమోనని పట్టించుకోలేదని పలువురు తెలిపారు. ఈ హత్య స్థానికులే ఎవరో చేసి ఉండొచ్చునన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. విజయనగరం నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ కూడా వచ్చి వివిధ ప్రాంతాలను పరిశీలించింది. కుమారుడు గౌరీశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శృంగవరపుకోట తరలించారు.

రోడ్డు కుంగిపోయి.. వాహనాలు కూరుకుపోయి

● మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న రోడ్డు ● స్తంభించిపోతున్న ట్రాఫిక్ ● ఇదీ బొబ్బిలిలోని రాజాకళాశాల సమీపంలో దుస్థితి



రోడ్డుపై కూరుకుపోయిన లారీ

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రాజా కళాశాల సమీపంలో రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారింది. ప్రధానంగా రోడ్డు కుంగిపోవడం వల్ల వాహనాలు కూరుకుపోతుండడంతో చోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. పారాది వంతెన, కాజ్‌వే శిథిలావస్థకు చేరడంతో భారీ వాహనాలు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దారిమళ్లించి రాజా కళాశాల రోడ్డు మీదుగా వెళ్లేందుకు అనుమతి ఇచ్చిన విషయం విదితమే. దీంతో ఈ రోడ్డుపై ఒత్తిడి పెరగడానికితోడు ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంగా కురిసిన వర్షాలు పూర్తిగా పాడైంది. ఈనేపథ్యంలో ఆ రోడ్డుపై వెళ్తున్న భారీ వాహనాలు కూరుకుపోతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆ భారీ వాహనాలను ఆ గుంతల్లో నుంచి కదిలించడానికి యంత్రాలను తీసుకురావల్సివస్తోంది. కాగా ఎమ్మెల్యే బేబీనాయన సొంత, మునిసిపాలిటీ నిధులతో పలుదపాలు ఈ రోడ్డుకు మరమ్మతులు చేసిన విషయం విదితమే. అయితే వర్షాలు, భారీ వాహనాల రాకపోకల వల్ల ఆ రోడ్డు యథాతథంగా కుంగిపోయి పెద్ద గుంతలుగా ఏర్పడుతోంది. కూటమి ప్రభుత్వం ఈ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించి రాకపోకలకు, రవాణా వాహనాలకు తగ్గట్టుగా అభివృద్ధిచేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



బురదమయమైన ప్రధాన రహదారి



రామభద్రపురం: గ్రంథాలయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



బొబ్బిలి: గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

విజ్ఞానం పెంపొందించుకోవాలి

● శాఖా గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

రామభద్రపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి సత్యవాణి కోరారు. శనివారం రామభద్రపురం శాఖా గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలే కాకుండా విద్యా, వైద్యం, సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు.

● బాడంగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బాడంగి గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ కండి రమేష్ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వై.రవిబాబు నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలు, గ్రంథాలయ అభివృద్ధికి రూ. ఐదు వేలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు అభినందించారు.

●బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి గ్రంథాలయంలో శనివారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాన్ని పురస్కరించుకొని లైబ్రేరియన్ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శనను నిర్వహించారు.ఈసందర్భంగా విజ్ఞానానికి సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని లైబ్రేరియన్ స్వర్ణకుమారి తెలిపారు.

నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేయండి: ఎల్‌డీఎం



మాట్లాడుతున్న రమణమూర్తి

బొబ్బిలి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని ఎల్‌డీఎం వీవీ రమణమూర్తి కోరారు. శనివారం బొబ్బిలి మండల పరిషత్ సమావేశంలో ఎస్‌బీఐ లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో మండలస్థాయి బ్యాంకర్ల, లైన్ డిపార్ట్‌మెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రమణమూర్తి ప్రభుత్వ పథకాల అమలు స్థితి, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్‌సేవల లభ్యత, రుణాలు అందించే లక్ష్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాల పంపిణీ, గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి వంటి అంశాలపై చర్చించారు. వ్యవసాయశాఖకు సంబంధించి స్వల్పకాలిక రుణాలు, కౌలు రైతులకు పంట రుణాలు, అనుబంధ శాఖలకు సంబంధించి పశుపోషణకు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు, హౌసింగ్ రుణాలు తదితర పథకాలకు నిర్దేశించిన లక్ష్యాలు, వాటిలో పూర్తి చేసినవి, లక్ష్యాలను పూర్తి చేయలేకపోవడానికి గల కారణాలు, వాటి పరిష్కార మార్గాలపై బ్యాంకుల వారీగా, పథకాలు వారీగా సమీక్షించి సూచనలు చేశారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో బ్యాంకు లింకేజ్ లక్ష్యం ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 1,328 సంఘాలకు గాను 64 కోట్ల 81 లక్షలుకుగాను శత శాతం సాధించినట్లు తెలిపారు. సమావేశంలో ఏడీఏ మధుసూదనరావు, ఉద్యానశాఖాధికారి ఎస్.వెంకట రత్నం, వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి, నాలుగు మండలాల బ్యాంకర్స్, లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం: చైర్మన్

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం బొబ్బిలి పొట్టిశ్రీరాములు మునిసిపల్ హైస్కూల్‌లో హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి రాంబార్కితోపాటు కమిషనర్ లాలం రామలక్ష్మిలు చేతులు శుభ్రం చేసుకున్నారు. విద్యార్థులందరిచేత వారి చేతులను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ పెదిరెడ్ల కిరణ్‌కుమార్, టీపీఆర్వో మామిడి జగన్మోహనరావు, ఆర్వో నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు సీహెచ్ మురళి పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేయిస్తున్న పోలీసులు

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు పూర్తి చేసి... మానవత్వాన్ని చాటుకున్నారు బొబ్బిలి పోలీసులు. వివరాలివీ.. మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఈనెల 14న స్థానిక ప్రభుత్వ ఐటీఐ సమీపంలో హెచ్‌టీ విద్యుత్ టవర్ పైకి ఎక్కి... షాక్‌తో అక్కడి నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ఆ మృతదేహం కోసం ఎవరైనా వస్తారేమోనని స్థానిక సీహెచ్‌సీ మార్చురీలో ఉంచారు. ఎవరూ రాకపోవడంతో పోలీసు సిబ్బంది, సామాజిక కార్యకర్త క్లైవ్ కూపర్ సహకారంతో ఎస్ఐ రమేష్ తన సొంత ఖర్చులతో అనాథ మృతదేహానికి శనివారం అంత్యక్రియలు పూర్తి చేయించారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని క్లైవ్ ప్రార్థనలు చేశారు. మానవత్వం చాటుకున్న ఎస్ఐ రమేష్‌ను, సిబ్బందిని స్థానికులు అభినందించారు.

ఆ గురుతులు అ'పూర్వం'

(ఐదో పేజీ తరువాయి)

వహించారు. తొలుత అత్యున్నత అధికారులుగా బాధ్యతలు నిర్వహించిన వారిని ఆయన పరిచయం చేశారు. విజయబ్యాంకు డైరెక్టర్ బీఎస్ రామారావు, ఎ.సుధీర్, సోమేశ్వర్‌తో పాటు పలువురు మాట్లాడారు. అప్పట్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన మార్తాండ, అప్పలస్వామి, పీకే బోస్‌లను సన్మానించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ వింగ్ కమాండర్ కిరణ్, పూర్వ విద్యార్థి సంఘాల కో-ఆర్డినేటర్ కె.శశికిరణ్‌లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి బీఎస్ రామారావు మాట్లాడుతూ, మరో జన్మ అంటూ ఉంటే కోరుకొండ సైనికస్కూల్‌లో చదువుకోవాలని దేవుడ్ని కోరుకుంటున్నానన్నారు. అంకితభావంగల ఉపాధ్యాయులు, చిత్తశుద్ధి కలిగిన విద్యార్థుల వల్లే నేటికీ కోరుకొండ సైనిక స్కూల్ విశేష ప్రాచుర్యం పొందుతోందని చెప్పారు. పూర్వ విద్యార్థులంతా కలిసి ప్రస్తుత విద్యార్థుల కోసం 160 బీరువాలను అందించారు.

ఎంతో ఆనందంగా ఉంది



ఎంతో ఆనందంగా ఉంది. ఆ నాటి విద్యార్థులతో కలిసి స్కూల్‌ను సందర్శించడం, అందరం కలిసి మాట్లాడుకోవడం మరిచిపోలేనిది. అత్యున్నత స్థానాలను అధిరోహించిన విద్యార్థులను చూసి ఎంతో ఆనందం కలిగింది. కోరుకొండ సైనిక స్కూల్ విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ ఈనాటికీ కొనసాగుతున్నది. భవిష్యత్తులో కూడా ఇలాగే ఉండాలి.

పీకే బోస్, పూర్వ ఉపాధ్యాయుడు, కోరుకొండ సైనిక స్కూల్

తీర్చిదిద్దిన ఘనత కోరుకొండ స్కూల్‌దే



విద్యను అభ్యసించి దేశ, విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డాం. మంచి హోదాల్లో దేశానికి సేవలు అందించాం. ఆ ఘనత కోరుకొండ సైనిక స్కూల్‌కే దక్కుతుంది. సుదూర ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఈ రోజు ఇక్కడకు వచ్చాం. ఇబ్బందులన్నీ మరిచిపోయి ఆనందంగా గడిపాం. ఈ క్షణాలు మరువలేనివి. పూర్వ విద్యార్థులమంతా కలిసి 160 బీరువాలను అందించాం.

సీఎం రెడ్డి, కెప్టెన్, పూర్వ విద్యార్థి

మరోసారి రావాలని కోరుకుంటున్నాం



అంతా ఒక చోట కలిశాం. చిన్న నాటి స్నేహితులను కలుసుకోవడం చాలా సంతోషం కలిగించింది. ఇలాంటి అవకాశం మరోసారి రావాలని కోరుకుంటున్నాం. విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ కోరుకొండ సైనిక స్కూల్ సొంతం. నేను క్రీడలపై ఆసక్తి చూపి ఎన్నో పతకాలు సాధించాను. చదువుకున్న స్కూల్‌కు కాసంత సాయం చేశాం. పూర్వ విద్యార్థులమంతా కలిసి 160 బీరువాలను అందించాం.

బీఎస్ రామారావు, డైరెక్టర్, విజయాబ్యాంకు

బొబ్బిలిలో శివస్వాముల శోభాయాత్ర



బొబ్బిలిలో భస్మధారణతో శోభాయాత్ర చేస్తున్న శివస్వాములు

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలోని పూల్‌బాగ్, రావువారి వీధికి చెందిన శివ స్వాములు కార్తీక ఏకాదశి పురస్కరించుకొని శనివారం రాత్రి భస్మధారణతో శోభాయాత్ర నిర్వహించారు. గురుస్వామి కర్రోతురాములప్పన్న, బొత్స అప్పలు ఆధ్వర్యంలో వందలాదిమంది శివస్వాములు భస్మధారణ చేసుకొని శోభాయాత్ర చేపట్టారు. ఢమరుకాలు వాయించుకుని శివనామస్మరణతో హోరెత్తించారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబొబ్బిలిలో పిచ్చికుక్క రెండు, మూడురోజులుగా స్వైరవిహారం చేసి తొమ్మిది మందిపై దాడి చేసి గాయపరిచింది. శనివారం తెల్లవారుజామున ఇద్దరిని కుక్క కరవడంతో మునిసిపల్ అధికారులు స్పందించి తమ సిబ్బందిని పంపించి కుక్కను పట్టుకొని చంపేశారు. పిచ్చి కుక్కకాటుకు గురైన బాధితులు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. పాచి పెంట నుంచి పాతబొబ్బిలికి కుమార్తెను చూడడానికి వచ్చిన వ్యక్తిని పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బాడంగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విజయనగరం ఈగల్‌బృందం సభ్యులు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు విజయకుమార్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అల్లు భాస్కరరావు కోరారు.శనివారం మండలంలోని కృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాలను పరిశీలించారు.తొలుతవంటశాలను పరిశీలించి మధ్యాహ్నం భోజనం నిర్వహణపై వంట నిర్వాహకులతోమాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్, కార్యదర్శి, హెచ్ఎం పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న దళిత మహిళ లక్ష్మిపై జనసేన నాయకురాలు కులం పేరుతో దూషించడమే కాకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో అరెస్టుచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న కోరారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మూడు నెలల గడుస్తున్నా ఇంతవరకూ అరెస్ట్ చేయకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మికి న్యాయం జరిగే వరకూ దశలవారీగా పోరాటం చేస్తామని చెప్పారు.

వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

తెర్లాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వారంరోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తెలిపారు. శనివారం తెర్లాం సచివాలయంలో ఈ-పంట నమోదుపై నిర్వహించినకార్యక్రమంలో మాట్లాడుతూ ఈ-పంటలో నమోదైన రైతులు జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే వెంటనేసిబ్బందికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఏవో శ్రీనివాసరావు, ఏఈవో ఆదిలక్ష్మి, రమ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి లక్ష తులసి పూజ

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలోని కంచరవీధి గల కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శనివారం కార్తీకఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి లక్ష తులసి పూజను నిర్వహించారు. వేణుగోపాలస్వామి, సింగారపువీధి వైభవ వేంకటేశ్వర స్వామి, స్వామివారివీధి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు.

సంక్షేమానికి చంద్రబాబు రోల్ మోడల్

బాడంగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు రోల్ మోడల్ కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు తెలి పారు. శనివారంబాడంగిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖలో నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కొట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరుగుతున్నాయని తెలిపారు. 17 నెలల్లో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చయని, 20 లక్షల ఉద్యోగాలు కూడా దక్కుతాయని చెప్పారు.

పంట నమోదుపై సామాజిక తనిఖీ

బొబ్బిలి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):పెంట తదితర రైతు సేవా కేంద్రా ల్లో శనివారం ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి నిర్వహించిన పంట నమోదు ప్రక్రియపై వ్యవసాయ అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఖరీఫ్‌లో ఏయే పంటలు రైతులు సర్వే నెంబర్ ప్రకారం నమోదు చేస్తు న్నారో వాటి వివరాలు రైతులకు చదివి వినిపించి ఆ జాబితాను రైతు సేవాకేం ద్రాల్లో ప్రదర్శించారు. పంట నమోదుపై సందేహాలు, మార్పులు, చేర్పులు ఉంటే సోమవారంలోగా అర్జీచేసుకుంటే సరి చేస్తామని రైతలకు తెలియజేశారు. కార్యక్ర మంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.